## కొత్తగూడెం ఎయిర్ పోర్టు స్థల పరిశీలనకు

# కేంద్ర బృందం రాక

-20న విమానాశ్రయ ఏర్పాటు స్థల పరిశీలన
కొత్తగూడెంలోని పలు ప్రాంతాలలో పర్యటన
-బృందం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు
విమానాశ్రయం ఏర్పాటుతో యువతకు ఉద్యోగాలు
-మారనున్న జిల్లా రూపురేఖలు
రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వెల్లడి

2లో




జాతీయ తెలుగు దినపత్రిక



# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 11 | జనవరి | 2025 | పేజీలు : 5







# భూలోక వైకుంఠమే..

-భద్రగిరిలో వైభవంగా 'ముక్కోటి' వేడుకలు
-ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన సీతారామచంద్రస్వామి
-తిలకించి పులకించిన భక్తజనం
-రామనామ స్మరణతో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

మిగతా2లో..





*భద్రాచలం/జనవరి 10(ప్రజాజ్యోతి):*

భద్రగిరి భూలోక వైకుంఠంగా మారింది. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన శ్రీ సీతా లక్ష్మణ సమేత రామచంద్రస్వామిని దర్శించుకున్న భక్తులు తన్మయత్వంతో మైమరిచారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, ధూపదీపాలు, జయజయ గంటల నడుమ గరుడ వాహనంపై రామయ్య, గజవాహనంపై సీతమ్మ, హను మత్ వాహనంపై కొలువుదీరిన లక్ష్మణస్వామి వార్ల దర్శనాలతో భ ద్రాచల దివ్యక్షేత్రంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఒకవైపు దివ్యతేజంతో వెలుగొందుతున్న రామయ్య

## సంక్రాంతికి ఊరెళ్తున్నారా..

# జరభద్రం..!

అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు
ఇండ్లకు తాళాలు వేసి దూర ప్రయాణాలు చేసేవారు పోలీస్ వారికి సమాచారం అందించండి
కాలనీల్లో ,ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు శ్రేయస్కరం
జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




2 లో

# కూలీల కొరత

-ఆలస్యం అవుతున్న పత్తి తీత
-కూలీల కొరతతో నష్టపోతున్న రైతులు
-ఇతర రాష్ట్రాల కూలీలపై ఆధారపడు తున్న రైతులు
-కొందరు కూలీలను తెచ్చుకొని వ్యాపారంగా మార్చుకుంటున్నారు
-పత్తి రైతుల వెతలుపై స్పెషల్ స్టోరీ....



జూలూరుపాడు/జనవరి 10 (ప్రజా జ్యోతి) :

మండల పరిధిలో రైతులు వేల ఎకరాల్లో ప్రతి సంవత్సరం పత్తి పంటను వేస్తుంటారు . ఈ క్రమంలో కూలీల కొరతతో పత్తి తీసే సమయాలలో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మరో పక్క పత్తితోపాటు మిర్చి పై కూడా రైతులు ఆసక్తి కనపరుస్తుంటారు మిర్చితో రైతులకు లాభాలు ఉండడంతో మిర్చి వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ఈ ప్రభావం పత్తి రైతులపై పడుతుంది. సహజంగా ఛత్తీస్గడ్ మహారాష్ట్ర కూలీలు మిర్చి కోతలకు వస్తుంటారు. కొందరు రైతులు కూలీలతో ముందే మాట్లాడుకుని వాహనాల ద్వారా తమ పొలాల వద్దకు తీసుకువచ్చి గుడిసెలు వేస్తూ అక్కడే వారికి అవకాశాలు కల్పిస్తున్నారు. ప్రత్తి తీత సమయాల్లో వలస కూలీలకు వేరే పనుల కారణంగా ప్రత్తి తీసే సమయం ఉండటం లేదు. ఈ కారణంగా కూలీలు దొరకక ప్రతి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రతి కూలీలు కూడా పెరగడంతో కిలోకి 15 రూపాయలు 20 రూపాయలు చొప్పున కూలీలు డిమాండ్ చేయడంతో 500 లో 200 కూలీలకే సరిపోతుందని పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి కోతలప్పుడు ఇతర రాష్ట్రాల కూలీలు మండలానికి చేరుకుంటారు సహజంగా మిర్చి కోతలకు ఇతర రాష్ట్రాల నుంచి

మిగతా2లో..

# భూలోక వైకుంఠమే



స్వామి, మరోవైపు విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న రామాలయ ప్రాంగణం భక్తులను మరింతగా ఆకర్షించాయి.రామనామ కీర్తనల నడుమ.. ఉత్తర ద్వార దర్శనానికి ముందు శ్రీ సీతారామచం ద్ర స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. సంప్రదాయం ప్రకారం సుప్రభాత సేవ, విశేష అభిషేకాలు గావించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామివారిని ఆలయ మర్యాదలతో వెండి గరుడ వాహనంపై ఉత్తర ద్వారంలోకి తీసుకొచ్చారు. దేవస్థాన హరిదాసులు శ్రీరామ కీర్తనలను పాడారు. అనంతరం స్థానాచార్యులు వైకుంఠ ఏకాదశి ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. రామయ్య, సీత, లక్ష్మణ వాహనాల ప్రత్యేకతల గురించి తెలియజేశారు. ఉదయం 5 గంటలకు వివిధ మంగళ వాయిద్య గంట మోగుతుండగా వేదఘోషల నడుమ వైకుంఠ ద్వారం తలుపులు తెరుచుకున్నాయి.

ఇల వైకుంఠమాయె..

వైకుంఠాన్ని మైమరిపించేలా ప్రత్యేకంగా అలంక రించిన ఉత్తర ద్వారంలో ధూప, దీపాల నడుమ దర్శనమిచ్చిన స్వామి, అమ్మవార్లను తిలకించిన భక్తులు పులకించిపోయారు. సుమారు గంట పాటు అక్కడ పూజలు నిర్వహించారు. నివేదన, పలనైవేద్యం, మంత్రపుష్పం సమర్పించిన తర్వాత వేదపా రాయణం గావించారు. ఆస్థాన పండితులు చతుర్వే దాలను పఠించారు. శరణాగతి, దండకం అనం తరం ద్వారదర్శన ప్రాశస్త్యాన్ని అర్చకులు వివరించారు. ఈ ఏకాదశి రోజున వైకుంఠంలో ముక్కోటి దేవతలు శ్రీ మహా విష్ణువును దర్శించుకుంటారని, ఉత్తరద్వారం నుంచి దర్శనమిస్తున్న శ్రీసీతారామచంద్రస్వామి అందుకే వైకుంఠ ఏకాదశి రోజున స్వామి వారిని దర్శించుకుంటే ముక్కోటి దేవతలను దర్శించుకున్నంత పుణ్యఫలం దక్కుతుందని వేద పండితులు వివరించారు.

శ్రీరామ నామ స్మరణతో మార్మోగిన భద్రగిరి..

ముక్కోటి ఏకాదశి సందర్భంగా మిథిలాస్టేడియం ప్రాంగణ పరిసరాలు 'జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్' నామస్మరణలతో మార్మోగాయి. నేత్రపర్వంగా సాగిన ఈ వేడుకకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పవిత్ర గోదావరీ నదిలో శుక్రవారం రాత్రి జరిగిన స్వామి వారి తెప్పోత్సవాన్ని తిలకించిన భక్తులు రాత్రికి భద్రాచ లంలోనే బస చేసి శనివారం తెల్లవారుజామున ఉత్తర ద్వారం ద్వారా రామయ్యను దర్శించుకు న్నారు. చలిని కూడా లెక్క చేయకుండా తెల్లవారు జామున 2 గంటలకే ఉత్తర ద్వారం వద్దకు చేరుకున్నారు.

వైభవంగా తిరువీధి సేవ..

ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన అనంతరం శ్రీసీతా లక్ష్మణ సమేతుడైన స్వామివారు తిరువీధి సేవకు బయలుదేరారు. గరుడ వాహనంపై రామచంద్ర మూర్తి, గజ వాహనంపై సీతమ్మవారు, హనుమత్ వాహనంపై లక్ష్మణస్వామి కొలువుదీరి రాజవీధి మీదుగా తాతగుడి వరకు తిరువీధి సేవకు వెళ్లారు. వారికి ముందు ఆండాళు అమ్మవారు. ఆళ్వార్ దేవత లు ఊరేగారు. వైభవంగా సాగిన తిరువీధి సేవలో వందల సంఖ్యలో భక్తులు స్వామివారి వెంట నడవగా గోవిందరాజ స్వామివారి ఆలయం వద్ద స్వామి వారు ప్రత్యేక పూజలందుకున్నారు. ఆ తర్వాత గ్రామ పదర్శనగా ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్ కలెక్టర్లు జితేష్ వి పాటిల్, ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్డీవో దామోదరరావు, ఆలయ ఈవో రమాదేవి, ఈఈ రవిందర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.



# సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జరభద్రం..!

**భద్రాద్రి కొత్తగూడెం జనవరి 10 (ప్రజాజ్యోతి)**

సంక్రాంతి పండుగ పిల్లలకు సెలవులుండటంతో చాలా మంది ప్రయాణాలు చేస్తారు.ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారు. ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని,ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. సంక్రాంతి పండుగ దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని, ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు.రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీని ముమ్మరం చేస్తున్నామన్నారు. ఈ విషయంలో జిల్లా పరిధిలోని ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అయన పలు సూచనలు చేశారు.

**సంక్రాంతికి ఊరెళ్లే వారికి పోలీసుల సూచనలు.**

దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా,ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు తెలపాలి. దీంతో వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని ఊర్లెళ్లిన వారి ఇండ్ల పరిసర ప్రాంతాల్లో నిఘాను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తూ ఉండమని మీ ఇంటి దగ్గర గల మీకు నమ్మకమైన ఇరుగు పొరుగు వాళ్ళకు చెప్పడం మంచిది. జిల్లాలో పోలీసులు చాలా ప్రదేశాల్లో ఇప్పటికే సీసీ కెమెరాలను ఇన్ స్టాల్ చేశారు. తద్వారా ఎన్నో సంచలనాత్మక నేరాలను ఛేదించారు. ప్రజలు తమ కాలనీలు, ఇళు ్లు, పరిసరాలు, షాపింగ్ మాళ్లలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలి. విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో,కారులలో పెట్టడం లాంటివి చేయకూడదు. ద్విచక్రవాహనాలు,కార్లను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి. రోడ్లపై నిలుపరాదు. బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు. తమతోపాటే తీసుకెళ్లాలి.

ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలి.

గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలి. పని మనుషులు ఉంటే రోజూ వాకిలి ఊడ్చమని చెప్పాలి.

వీలుంటే టైమర్‌తో కూడిన లైట్లను ఇంట్లో అమర్చుకోవాలి. మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్స్ పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడాలి. వాటిని కూడా గమనించి నేరస్తులు దొంగతనాలకు పాల్పడుతారనే విషయాన్ని గమనించండి. విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు. ఆరుబయట వాహనాలకు హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్ వేయాలి. వాచ్ మెన్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం. లేదా ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను తమ వెంట తీసుకెళ్లాలి. బ్యాగుల్లో బంగారు నగలు, డబ్బు పెట్టుకొని ప్రయాణం చేస్తున్నప్పుడు బ్యాగులు దగ్గరలో పెట్టుకోవాలి. బ్యాగు బస్సులో పెట్టి కిందికి దిగితే దొంగలు అపహరిస్తారు. ఇంటి డోర్‌కు సెంట్రల్ లాకింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకోవడం సురక్షితం. మీ ఇంట్లో అమర్చిన సిసి కెమెరా లను ఆన్ లైన్ లో ఎప్పటికప్పుడు చూసుకుంటూ వుండాలి. మీ ఇంటికి వచ్చి, వెళ్ళే దారులు మరియు ఇంటిలోపల సిసి కెమెరా లు అమర్చుకొని డివిఆర్ కనపడకుండా ఇంటి లోపల రహస్య ప్రదేశం లో పెట్టుకోండి. హోమ్ సెక్యూరిటీ సిస్టం ద్వారా ఇంటర్నెట్ అనుసంధానం ఉన్న మీ మొబైల్ నుంచే మీ ఇంటిని ఎక్కడి నుంచి అయినా లైవ్, ప్రత్యక్షంగా చూసుకునే వీలుంది. ఇంటికి సంబంధించిన నాణ్యమైన సిసిటివి లు ఆన్లైన్/ మార్కెట్ లో అందుబాటులో ఉన్నాయి. హోమ్ సెక్యూరిటీ సర్వేలయన్స్‌కు ఇవి ఎంతో ఉపయుక్తం. సొంత ఇల్లు అయినట్లయితే ఇంటి ప్రధాన ద్వారానికి గ్రిల్స్ అమర్చుకోవడం ద్వారా రెండంచెల భద్రతనిస్తుంది.

ఇంట్లో,ఇంటి బయట మోషన్ సెన్సార్ లను ఉపయోగించడం మంచిది. ఇంటి బయట మోషన్ సెన్సర్ లైట్లను ఉపయోగించండి. ఇవి చీకటి ఉన్నప్పుడు మాత్రమే పని చేస్తాయి. సెన్సార్లు పరిసరాల్లో ఏదైనా కదలిక గుర్తించగానే లైట్ వెలుగుతుంది. సాధారణంగా సరైన భద్రతా ప్రమాణాలు పాటించని ఇండ్లు, చీకటి ప్రదేశం, పాత గ్రిల్స్, బలహీనమైన తాళాలు ఉన్న ఇండ్లలో దొంగలు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి, కొత్త వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలి.

ప్రజలు తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలి. పోలీసు స్టేషన్ నెంబర్, వీధుల్లో వచ్చే బీట్ కానిస్టేబుల్ ఫోన్ నెంబర్ దగ్గర పెట్టుకోవాలి. ప్రజలు నిరంతరం పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే చోరీలను నియంత్రించడం చాలా సులభం. అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇళ్లకు తాళాలు వేసి దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలి. కాలనీవాళ్లు కమిటీలు వేసుకొని వాచ్‌మెన్లను, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకకోవాలి. రాత్రి సమయంలో కొత్తవారు ఎవరైనా వచ్చినా వారి వివరాలు తెలుసుకుని రిజిస్టర్‌లో నమోదు చేసుకోవడం మంచిదని అపార్టుమెంట్ వాచ్‌మెన్‌లకు తెలపాలి. ఎప్పుడు కూడా స్థానిక పోలీసు స్టేషన్ నెంబర్ దగ్గరుంచుకోవడం మంచిది. సోషల్ మీడియాలో మీరు బయటికి వెళ్ళే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడము మంచిది కాదు.

కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలను నిర్వహించుకోవాలి. ఈ కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు పోలీసులకు అందుబాటులో ఉంటూ అనుమానాస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై డయల్ 100 నకు ఫోన్ చేసి సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఒక ప్రకటనలో సూచించారు.

# కూలీల కొరత

కూలీలు భారీగా వస్తుంటారు. ఒక సంవత్సరం
తీసుకువచ్చిన రైతులే వారిని మళ్లీ తమ పంట పొలాలకు రప్పిస్తుంటారు. వారి పొలాల్లో వారికి షెల్టర్లు ఏర్పాటు చేసి నిత్యావసర వస్తువులు కూడా ఏర్పాటు చేయడంతో కూలీలు ఆ రైతుల వద్దనే ఉంటున్నారు. మిర్చి కూలీలు కోతల అనంతరం తిరిగి వాహనాల్లో రైతులు పంపిస్తూ ఉంటారు.

కొందరు కూలీలతో వ్యాపారం సాగిస్తున్నారు

మండలంలో కొందరు కూలీలను మాట్లాడుకుని తీసుకువచ్చి వారికి షెల్టర్ ఇచ్చి రైతుల వద్ద నుంచి కొంత డబ్బులను తీసుకొని కూలీలను వారి పొలాలకు పంపిస్తున్నారు. మండలంలో ఇది ఒక వ్యాపారంగా సాగుతోంది. కూలీలను తమ వద్ద పెట్టుకుని ఎకరాకు 1000 ,2000 చొప్పున మధ్యవర్తి తీసుకోవడం డబ్బులు ఇచ్చిన వారికే పంపించడం వల్ల చిన్న సన్నకారు రైతులకు ఇబ్బందులుగా మారాయి. ఏది ఏమైనా మండల వ్యాప్తంగా వేల ఎకరాలలో పత్తి ఇప్పటికీ కూలీలు దొరకక చెట్లపైనే కారుతోంది కూలీల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

### కొత్తగూడెం ఎయిర్ పోర్టు స్థల పరిశీలనకు

# కేంద్ర బృందం రాక

**భద్రాద్రి కొత్తగూడెం జనవరి 10 (ప్రజాజ్యోతి)**

కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు తథ్యమని, ఈనెల 20న కొత్తగూడెంలోని పలు మండలాలలో ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందాలు పర్యటిస్తాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఇటీవల కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుని కలిసి కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని కోరిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నిర్మాణానికి సంబంధించి గతంలో సూచించిన కొత్తగూడెం పరిసర ప్రాంతంలో భూములు అనుకూలంగా లేవని అనుమతి నిరాకరించగా, కొత్తగూడెం పరిధిలోని కొత్తగూడం, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాలలో పలు భూములను గుర్తించామని, అక్కడ సర్వే నిర్వహించాలని ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకి లేఖ రాశారు. ఆ లేఖకు కేంద్ర మంత్రి బదులిస్తూ, ఎయిర్ పోర్టు నిర్మాణానికి సాధ్యసాధ్యాల పరిశీలనకు ప్రత్యేక బృందం రావాల్సి ఉంటుందని, అందుకు అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని లేఖలో పేర్కొన్నారు. దీనికి స్పందించిన మంత్రి తుమ్మల, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని స్వయంగా కలిసి అంశాన్ని వారికి వివరించారు. తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి అందుకు అవసరమయ్యే నిధుల విడుదలకు ప్రత్యేక జీవో విడుదల చేశారు. దీంతో నిధులు మంజూ-రయ్యాయి. ఈ అంశాన్ని మంత్రి తుమ్మల కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకి లేఖలో వివరించారు. అలాగే త్వరితగతిన సర్వే నిర్వహించేల ఆదేశాలు జారీ చేయాలని కోరారు. జిల్లాలో అనువైన స్థలంకోసం సర్వే నిర్వహించేందుకు పలు ప్రాంతాలను గుర్తించామని ఆ భూముల సాధ్యాసాధ్యాలు నిర్ధారించేలా చొరవ చూపాలని కోరారు.

20న ప్రత్యేక బృందం జిల్లాలో పర్యటన...

మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటు సాధ్యాసాధ్యాల పరిశీలనకు ప్రత్యేక బృందం వస్తున్నట్లు వెల్లడించారు. ఈ బృందం పర్యటనకు కావలసిన అన్ని ఏర్పాట్లు చూడాలని జిల్లా కలెక్టర్ ని మంత్రి తుమ్మల ఆదేశించారు. ఎక్కడ కూడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగూడెం పరిసరాల్లో విమానాశ్రయం ఏర్పాటు చేస్తే జిల్లా రూపు రేఖలు మారనున్నాయన్నారు. ఇప్పటికే కొత్తగూడెం పాల్వంచ కలిపి కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదించిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

విమానాశ్రయం తో రూపురేఖలు మారనున్న కొత్తగూడెం...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. విమానాశ్రయం ఏర్పాటుతో కొత్తగూడెం జిల్లా రూపు రేఖలు మారుతాయన్నారు. వేలాదిమంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. వాణిజ్యపరంగా, పర్యాటకపరంగా, పారిశ్రామికపరంగా అభివృద్ధికి విమానాశ్రయం ఎంతో దోహదం చేస్తుందన్నారు. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం, సింగరేణి గనులకు పేరుగాంచిన కొత్తగూడం మరియు అశ్వాపురంలో భారజల పరిశ్రమకు దేశ విదేశాల నుంచి పర్యాటకులు సైతం వచ్చేందుకు ఈ విమానాశ్రయం ఎంతగానో దోహదపడుతుందన్నారు.

సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు...

విమానాశ్రయం ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారం మరవలేనిదన్నారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేశారని, ఎయిర్ పోర్టుకు కావలసిన భూములను గుర్తించేందుకు సహాయ సహకారాలు అందించారన్నారు. అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# ఓ సారులు కుక్కలు నా మేకల్ని చంపుతున్నాయి





**టేకులపల్లి/జనవరి 10, (ప్రజాజ్యోతి) :**

వీధి కుక్కలు తన మేకలను చంపేస్తున్నాయని, కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎన్నిసార్లు కోరిన గ్రామపంచాయతీ అధికారులు, ప్రత్యేక పర్యవేక్షణ అధికారులు పట్టించుకోవడంలేదని తెలగురు గ్రామానికి చెందిన బండ్ల కృష్ణ ఆరోపించారు. ఈ సందర్భంగా బండ్ల కృష్ణ మాట్లాడుతూ వీధి కుక్కల దాడిలో గతంలోనూ మూడు మేకలు చనిపోయాయని, ఇప్పుడు మరోసారి దాడి చేయడంతో నాపై దాడి చేసిన అనంతరం మరో మేకను అతి దారుణముగా చంపివేశాయిఅని ఆవేదన వ్యక్తం చేశాడు. కొందరు వ్యక్తులు వీధికుక్కలకు మాంసం వేస్తూ పెంచుతుండడంతో అవి యథేచ్ఛగా తిరుగుతూ దాడులు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశాడు. వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ ఆఫీసర్లను ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కలను నివారించడానికి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. బాయిలర్ కోడి మాంసం, కోడి వ్యర్థ పదార్థం వేస్తూ, కనుక్కోలేనటువంటి, అర్థం కానటువంటి రోగాలు వీధి కుక్కలకు వస్తున్నాయి అని వారు ఆరోపిస్తున్నారు. మా ఊర్లోనే కాకుండా టేకులపల్లి మండల కేంద్రంలో కూడా చికెన్ షాప్ యాజమాన్యులు ఇష్టం వచ్చినట్టుగా కోళ్ల పేగులు పెద్ద పదార్థాలను దుకాణం వద్ద ఉన్నటువంటి కుక్కల మందకు వేస్తూ అర్థం కాని జబ్బులు వస్తున్నాయి. అయినా కూడా చికెన్ షాప్ యజమానులు ఎటువంటి నియమ నిబంధన లేకుండా షాపులు నడిపిస్తున్న తీరు గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు.

# మనిషి జీవితానికి ఆరోగ్యమే ప్రధానం

**ఇల్లందు/జనవరి 10, (ప్రజాజ్యోతి) :**

ప్రతి మనిషి జీవితానికి ఆరోగ్యమే ప్రధానమని ఐయంసి క్రౌన్ అంబాజీడర్, కోచ్, ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు చెన్న గోపి పేర్కొన్నారు. శుక్రవారం ఇల్లందు ప్రెస్ క్లబ్ లో జరిగిన ఆరోగ్యంపై ఆయుర్వేద చికిత్సపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐయంసి ప్రోడక్ట్స్ ద్వారా ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా బలోపేతం అవచ్చని తెలిపారు. మనిషి ఆరోగ్యం ఎలాంటి రోగాలు రాకుండా ఉండాలంటే ఆయుర్వేద వైద్యమే శ్రేయస్కరమని సూచించారు. మనిషికి ఎలాంటి రోగాలు వస్తే యునానీ వైద్యానికి మక్కువ చూపుతున్నారని, అక్కడ ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో ఆయుర్వేదం వైపు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఇంగ్లీష్ వైద్యానికి సమయం కేటాయిస్తూ, ఆయుర్వేద వైద్యం చికిత్సకు వచ్చేసరికి ఎప్పుడు తమ జబ్బు నయం అవుతుందని ఓపిక లేకుండానే అడుగుతున్నారని పేర్కొన్నారు. ఆయుర్వేద వైద్యం వల్ల భవిష్యత్ లో ఎలాంటి జబ్బు రావని స్పష్టం చేశారు. అనంతరం చెన్న గోపిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐయంసి ప్రతినిధులు స్వర్గం



కోటేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీరంగం జయంత్, అయ్యప్ప, గుర్రం రాజేష్, ప్రెస్ క్లబ్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు కులస్తుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



**ఇల్లందు/జనవరి 10,( ప్రజాజ్యోతి) :**

మున్నూరు కాపు కులస్తుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక కరెంట్ ఆఫీస్ వద్ద గల హొండా షో రూమ్ లో జరిగిన ఇల్లందు మున్నూరు కాపు సంఘ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల సంఘాలను ఏర్పాటు చేసుకొని వారి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. పేద కులస్తులు అన్ని విధాలుగా సంఘం ఆదుకోవాలని కోరారు. మున్నూరు కాపు కుల కమ్యూనిటీ నిర్మాణం కోసం స్థల ఏర్పాటు కృషి చేస్తానని స్పష్టం చేశారు. మున్నూరు కాపు కులస్తులకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ముందుగా ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగళి నరేష్, ఆవుల శ్రీనివాస్, కోశాధికారి ఆకుల చందర్ రావు, పాలెపు ఆనంద్, కొక్కు నాగేశ్వరరావు, ఎస్. రంగనాథ్, దంతాల ఆనంద్, తోట లలితా శారదా, కటకం పద్మావతి, చిల్లా భారతి, సత్యం, కామిశెట్టి దుర్గారావు, పగడాల చందు, చిల్లా శ్రీనివాస్, కలవల సుధాకర్, పెద్దినేని రామకృష్ణ, పెద్దినేని హరినాథ్ బాబు, కూతురు అరుణ్, రాజురి వైశాక్, కొక్కు సరిత, రాఘవరపు రాకేష్, పోతునూరి మాధవరావు, ఓం ప్రకాష్, రాజశేఖర్, కంకిపాటి రామారావు, పులి సైదులు, కొండ నారాయణ, బత్తుల రాధాకృష్ణ, దాస్యం సురేంద్ర బాబు, గంగారపు శేషు, ఉమా, ఆముదాల సతీష్, కనపర్తి అంజిబాబు, ప్రేమ్, సృజన్, నల్ల సత్యనారాయణ, వీర సమ్మయ్య, మున్నూరు కాపు కులస్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం - ఎమ్మెల్యే కోరం

టేకులపల్లి/ జనవరి 10, (ప్రజాజ్యోతి) : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని అందులో బాగంగా మండలంలోని కోటల్ల గ్రామంలో సిసి రోడ్లు పనులను ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో గడీల పాలన పోయి ప్రజా పాలన వచ్చిందని, ప్రజలందరికి స్వేచ్ఛ లభించిందని పేర్కొన్నారు. పలు గ్రామాల్లో, మండలాలలో కాంగ్రెస్ పార్టీకి విశేష స్పందన లభిస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అన్ని ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని స్థానిక ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి, క్యాబినెట్ మంత్రి వర్గం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే దిశగా ఎంతో కృషి చేస్తున్నారు. అట్టి పరిస్థితుల్లో స్థానిక ఎన్నికలలో మన అభ్యర్థులను గెలిపించుకొని గ్రామాలలో మరెన్నో అభివృద్ధి పనులు చేసుకునే విధంగా ముందడుగు వేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కోరం సురేందర్, మండల నాయకులు ఈది గణేష్, రెడ్యా నాయక్, భద్రు, రామకృష్ణ, మురళీ, లక్ష్మయ్య, రాజు, హరిలాల్, దేవిలాల్, బిక్కులాల్ బాణోత్ రవి, బోస్, సుదీప్,ఇతర నాయకులు, పాల్గొన్నారు.



# సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీలకు ఆహ్వానం



టేకులపల్లి/ జనవరి 10, (ప్రజాజ్యోతి) గ్రావిటీ ప్రీమియం స్కూల్ లో ఈ నెల 12వ తేదీ సంక్రాంతి పండుగను గ్రావిటీ ప్రీమియం స్కూల్ ఆవరణములో సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు గ్రావిటీ ప్రీమియం స్కూల్ చైర్మన్ బోడా పుణ్య నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 న ముత్యాల ముగ్గుల పోటీలు మధ్యాహ్నం 2:30 గంటలకు సాంప్రదాయ పద్ధతిలో పోటీలను నిర్వహించడం జరుగుతుంది . ఈ పోటీకి 40 నిమిషాలు మాత్రమే సమయం ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. ఆసక్తిగల మహిళలు తమ పేర్లను పోటీకి ముందుగానే గ్రావిటీ స్కూల్ లో పేర్లు నమోదు చేసుకోగలరని తెలిపారు. మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రధానం చేయబడతాయని వారు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే మహిళలు ముగ్గులు మాత్రమే వేయవలెను, ఈ ముగ్గులు వేసే మహిళలు ఎవరి ముగ్గు వారు ఎవరి కలర్స్ వారు తెచ్చుకోవలెను. ముగ్గులు వేసేటప్పుడు ఎవరి సహాయము, పరికరాలను ఉపయోగించకూడదు. మీ పేరు నమోదు చేసుకోవడానికి 8374825748 ఈ నెంబర్ ను వివరాలు సంప్రదించగలరు అని వారు తెలిపారు.

# ముందస్తు సంక్రాంతి సంబరాలు



**టేకులపల్లి/జనవరి 10, ప్రజాజ్యోతి :**

ముందస్తు సంక్రాంతి సంబరాలను వేడుకలను బోడు జడ్పీఎస్ఎస్ పాఠశాల హెడ్మాస్టర్ జగన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల సంక్రాంతి ముగ్గులు వేసి విద్యార్థులు ఉపాధ్యాయులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, దేవిలాల్, పొట్టెమ్మ, జ్యోతి, గిరిబాబు, లక్ష్మణ్, ఉమా, శ్రీనివాస్, శంకర్, కిరణ్, భద్రం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్యూర్ ఆయుర్వేదిక్ స్టోర్ ప్రారంభం



**ఇల్లందు, జనవరి 10, ప్రజాజ్యోతి:**

పట్టణంలోని కొత్త బస్టాండ్ సెంటర్ వద్ద శుక్రవారం రవి ప్యూర్ ఆయుర్వేదిక్ అండ్ ఆర్గానిక్ స్టోర్ ను ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఐయంసి క్రౌన్ అంబాసిడర్, స్కిల్స్ కోచ్, ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు చెన్న గోపిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐయంసి ఉత్పత్తుల వినియోగం ద్వారా ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా బలోపేతం అవవచ్చని తెలిపారు. మనిషికి ఎలాంటి రోగాలు రాకుండా ఉండాలంటే ఆయుర్వేద వైద్యమే శ్రేయస్కరమని సూచించారు. ఇంట్లో వాడుతున్న కల్తీ వస్తువులకు బదులు ఆయుర్వేద వస్తువును వినియోగించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య, చెన్న గోపి, స్వర్గం కోటేశ్వరరావు ని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐయంసి ప్రతినిధులు సత్యనారాయణ, శ్రీరంగం జయంత్, అయ్యప్ప, గుర్రం రాజేష్, కల్లేపల్లి రవి, పగడాల చందు, ప్రెస్ క్లబ్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.



# రాపత్తు ఉత్సవాలు ప్రారంభం..

## తొలిరోజున పోలీసు శాఖ తరపున సేవ





**భద్రాచలం, జనవరి 10(ప్రజాజ్యోతి) :**
భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వరలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా పగల్ పత్తు ఉత్సవాలు ముగిసి.. శుక్రవారం రాత్రి స్వామివారికి రాపత్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో రాపత్ ఉత్సవం తొలిరోజున పోలీసు శాఖ తరపున పట్టణంలోని డిఎస్పీ బంగ్లాలో (ప్రస్తుత ఏఎస్పీ కార్యాలయం)లో వైభవంగా నిర్వహించారు. ఈ క్రమంలో తొలుత స్వామి వారిని ఆలయం నుంచి ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ , సీఐలు సంజీవరావు, నాగరాజు రెడ్డి , ట్రాఫిక్ యస్ ఐ మధు ప్రసాద్ మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, భాజాభజంత్రీల నడుమ ప్రధాన ఆలయం నుంచి స్వామివారి ఉత్సవమూర్తులను పట్టణంలోని డిఎస్పీ బంగ్లాకు తీసుకువచ్చి డీఎస్పీ కంగ్రాట్స్ మండపంలో స్వామివారి ఆశీస్సులు చేసిన ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం లాంటి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.

# వాహనదారులు రహదారి భద్రతా నియమాలను పాటించాలి

## ఎంవిఐ సంఘం వెంకట పుల్లయ్య




**భద్రాచలం టౌన్/జనవరి 10, (ప్రజాజ్యోతి)**
ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు రహదారి భద్రతా నియమాలను పాటించాలని ఎంవిఐ సంఘం వెంకట పుల్లయ్య తెలిపారు . రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం భద్రాచలం రవాణా శాఖ యూనిట్ ఆఫీస్ భద్రాచలం కార్యాలయంలో. లెర్నర్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, మోటార్ సైకిల్ రిజిస్ట్రేషన్, ఆటో రిజిస్ట్రేషన్ , ఫిట్నెస్ కు వచ్చిన వాహన దారులకు రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై వెంకట పుల్లయ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించడం, వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్ అనుసరించడం, వాహనాలను ఓవర్టేక్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండడం, సెల్ ఫోన్ డ్రైవింగ్, సీటు బెల్ట్ డ్రైవింగ్, మూల మలుపుల వద్ద నిదానంగా వెళ్లడం హారన్ కొట్టడం రోడ్డు ప్రమాదాల నివారణకు పక్కాగా పాటించవలసిన అంశాలు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక దూరం ప్రయాణించినప్పుడు ముందురోజు విశ్రాంతి తీసుకోవడం, శీతాకాలం వర్షాకాలంలో రోడ్డుపై ప్రయాణించే సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై వాహనదారులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు బాధ్యతాయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అయన కోరారు.

# ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చెయ్యాలి - సిఐటియు




**భద్రాచలం టౌన్/ జనవరి 10 (ప్రజాజ్యోతి) :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని భద్రాచలం నియోజకవర్గం ఆశా వర్కర్లు భద్రాచలం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే తో ఫోన్లో మాట్లాడి వారి సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని హామీ తీసుకొని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం సిఐటియు జిల్లా నాయకురాలు జి.పద్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశాపురం వర్కర్ల తో వెట్టి చాకిరి చేపిస్తున్నారని, ఫిక్స్ వేతనం 18 వేల రూపాయలు, 50 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ హామీని ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్న ఇప్పటి వరకు అమలు చేయలేదని, ఈ సంవత్సర కాలంలో ఆశా వర్కర్లు మండల జిల్లా రాష్ట్రస్థాయిలో అనేకమంది అధికారులను ఎమ్మెల్యేలను మంత్రులను కలిసి వారి సమస్యలను వెలుగుచ్చారని అన్నారు. నేటికీ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు తదితర సమస్యల పైన ఖచ్చితమైన నిర్ణయం చేయలేదని వచ్చే ఫిబ్రవరి మాసంలో జరిగే అసెంబ్లీ సమావేశంలో బడ్జెట్ కేటాయించాలని ఆ విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే కూడా ఒత్తిడి తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న కాలంలో ఆశ వర్కర్ల సమస్యపై సిఐటియు ఉధృతమైన పోరాటం నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సిఐటియు నాయకులు గడ్డం స్వామి, వై వి రామారావు ఆశ నాయకులు, శిరోమణి, చంద్రకళ, చిన్నక్క, భాగ్య, సుజాత, విజయలక్ష్మి, సుజాత, హైమా, చెల్లెమ్మ, అన్నపూర్ణ, వీరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సంక్రాంతి సంబరాలు





**భద్రాచలం టౌన్, జనవరి 10, (ప్రజాజ్యోతి )**
సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని క్రాంతి విద్యాలయంలో భోగి, సంక్రాంతి, బొమ్మల కొలువు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సమత శ్రీనివాస్మాట్లాడుతూ విద్యతో పాటు మన తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేయాలని ఈ వేడుక నిర్వహించాలని అన్నారు. పాఠశాలలో చదివి విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలు దేశభక్తి మన సంస్కృతి పై కనీస పరిజ్ఞానం ఉండేలా ప్రత్యేక కార్యక్రమాలు ఏటా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు అనంతరం పాఠశాల ప్రాంగణంలో రంగవల్లులు వేసి బొమ్మల కొలువు చేసి విద్యార్థులను అలంకరించి, భోగి పళ్ళు పోశారు. రంగవల్లు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సమత శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు ఐ. హేమ శిల్ప , ఇంచార్జ్ సాంబలక్ష్మి మరియు అధ్యాపక, అధ్యాపకేతర బృందంతో పాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రీ -సంక్రాంతి సంబరాలు

**భద్రాచలం టౌన్/ జనవరి 10(ప్రజాజ్యోతి) :**
భద్రాచలం పట్టణంలోని సెయింట్ పాల్స్ పాఠశాల ఆవరణలో ర్యాన్ కిడ్స్ వరల్డ్ ప్రాంగణంలో ప్రీ -సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో చిన్నారులు సాంస్కృతిక వారసత్వం, భిన్నత్వంలో ఏకత్వం, సాంప్రదాయాలను ప్రతిబింబించే వేషధారణలో పండగ వాతావరణాన్ని కలుగజేసి, పండగ ప్రాముఖ్యతను వివిధ సాంస్కృతిక కళా నైపుణ్యాలతో అందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ అబ్రహం, హెడ్ మాస్టర్ డాక్టర్ కె రాధా మాట్లాడుతూ పండుగను చక్కటి సాంప్రదాయ పద్ధతిలో కనువిందుగా ప్రదర్శింప జేసిన విద్యార్థులకు శు భాకాంక్షలు తెలియజేసి అభినందించి ఆశీర్వదించారు . అనంతరం పాఠశాల డైరెక్టర్ ఎస్ రాజేష్ డాక్టర్ కే అలీన శాంతి విద్యార్థుల కళాత్మక కార్యక్రమాలను వీక్షించి వారిని అభినందించి ఆశీర్వదిస్తూ, సహకరించిన తల్లిదండ్రులకు ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసి శు భాకాంక్షలు అందించారు.



# గిరిజన మ్యూజియం సందర్శించిన రైన్ వాటర్ ప్రాజెక్టు బృందం



**భద్రాచలం/ జనవరి 10 (ప్రజాజ్యోతి) :**
ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన మ్యూజియాన్ని రైన్ వాటర్ ప్రాజెక్టు బృందం, స్టూడియో పంచతంత్ర బృందాలు శుక్రవారం పర్యటించాయి. ఈ సందర్భంగా రైన్ వాటర్ ప్రాజెక్టు ఫౌండర్ సీఈవో కల్పనా రమేష్ ఆ బృందం సభ్యులతో కలిసి మ్యూజియంలోని కోయ కళాఖండాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజనుల పాత కాలపు కల్చర్ కు సంబంధించి కళాఖండాలను ఎగ్జిబిషన్ రూపంలో పర్యాటలకు చూపడమే కాకుండా వాటిని అమ్మకాలు జరిపి వాటి ద్వారా ఉపాధి పొందాలన్నారు. గ్రామాల్లో పాతకాలపు రాజుల కాలం నాటి కట్టడాలు, దిగుడుబావులు, మెట్ల బావుల్లోని నీరు వాడకం లేకపోవడం వల్ల పూర్తిగా చెత్తాచెదారంతో నిండిపోయి పాడుబడ్డ బావులుగా వదిలేస్తున్నారని, వాటిలో చెత్తను తీసి ఆ నీటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలో గ్రామస్థులకు పూర్తిస్థాయిలో తెలియచేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 600 బావుల వరకు మంచినీటి బావులుగా మార్చి ప్రజలకు వాడుకలోకి తెచ్చినట్లు తెలిపారు. పర్యాటకానికి అనువుగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రామాలను కలెక్టర్ జితేష్ ని పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్ సూచనల మేరకు ఇక్కడ ఉన్న పర్యాటక స్థలాలను గుర్తించడం జరిగిందని తెలిపారు. గోదావరి చెంతనే ఉన్న గ్రామాలు ప్రకృతి అందాలకు పెట్టింది పేరని, అలాంటి ప్రకృతి పరంగా దొరికే పండ్లు, ఫలాలు, ఔషధ గుణాలకు సంబంధించి ఇప్పపువ్వు, పుట్టతేనె, నెయ్యి, కాకరకాయ పచ్చళ్లు వంటి శరీర ఆరోగ్యాన్ని ఇస్తాయని, వాటిని క్రమపద్ధతిలో డిజైనింగ్ చేసి మార్కెటింగ్ చేసుకుంటే గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. గిరిజనులకు సరైన అవగాహన లేక వాటిని వృధా చేసుకుంటున్నారని వారికి అవగాహన కల్పించేందుకు మా పర్యటన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు నిహారిక, శ్రావణి, ఆదిత్య, ప్రాజెక్టు మేనేజర్ వెంకటేష్, పంచతంత్ర బృందం సభ్యులు, మ్యూజియం ఇన్చార్జ్ వీరాస్వామి పాల్గొన్నారు.



## ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్ పిఏ) క్యాలెండర్ ఆవిష్కరణ...





**దమ్మపేట/జనవరి10, (ప్రజాజ్యోతి ):**

ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ (ఐఎల్ పిఏ) నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం దమ్మపేట బార్ కౌన్సిల్ అధ్యక్షులు మారం సతీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన శ్రేణి న్యాయమూర్తి సాయి శ్రీ ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్ ను ఆవిష్కరించి కౌన్సిల్ సభ్యులందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాద వృత్తిరంగంలో ప్రామాణికతలను మెరుగుపరిచి, న్యాయవాదుల హక్కులను రక్షిస్తూ, వారి సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషిస్తూ , సామాజిక న్యాయానికి ఊతమిచ్చేవిధంగా పనిచేయడమే ఐఎల్ పిఏ లక్ష్యమని తెలిపారు. అదేవిధంగా ఐఎల్ పిఏ శక్తివంతమైన వేదికగా ఉండి, వృత్తిపరమైన విలువలను కాపాడుతూ న్యాయ ప్రక్రియను సామాన్య ప్రజలకు సులభతరం చేయడంలో సహాయపడుతుందని ఈ సందర్భంగా శ్రీ సాయి న్యాయవాదులకు సూచించారు. ఈ కార్యక్రమం న్యాయవాద వృత్తి ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ, న్యాయవాదులు ఐక్యమత్యాన్ని, వారి సామాజిక బాధ్యతను ప్రోత్సహించే విధంగా నిలిచిందని ఆయన ప్రశంసలు తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమం లో సీనియర్ న్యాయవాదులు ఉడతనేని శ్రీనివాసరావు, పీపీ శ్రీనివాస్, న్యాయవాదులు సోమిశెట్టి శ్రీధర్, కృష్ణ ప్రసాద్, లక్కినేని నరేంద్ర, గొంది మురళి, టి.బాలరాజు, గొంది సంధ్యారాణి, తీర్నాటి సంజయ్, తనగాల అరుణకుమారి, గద్దల అప్పారావు, నల్లపు ఉదయ్,గోళ్ళ భవాని కృష్ణ తధితరులు పాల్గొన్నారు.

## పోలీస్ పనితీరుపై ప్రజాభిప్రాయం (క్యూ ఆర్ )కోడ్ విడుదల



**జూలూరుపాడు/జనవరి 10 (ప్రజా జ్యోతి)**

: వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారులు తమతో పోలీస్ స్టేషన్ అధికారి, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఫిర్యాదు స్వీకరించే విషయంలో, ఎఫ్ఐఆర్ నమోదు చేసే విషయంలో, ఈ చలానా జరిమానా విధించే సమయంలో, ఏ విధంగా వ్యవహరించారు. సిబ్బంది పనితీరు గురించి 'క్యూ ఆర్' కోడ్ ద్వారా తమ అభిప్రాయం తెలియపరచవలసిందిగా, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, డిజిపి డాక్టర్ జితేందర్ అమలుపరిచిన క్యూఆర్ కోడ్ విధానం ద్వారా ఫిర్యాదుదారులు, మండల ప్రజలు తమ యొక్క అభిప్రాయాన్ని తెలియపరచవలసిందిగా నూతన క్యూఆర్ కోడ్ ను ప్రవేశపెట్టడం జరిగినది. ఇట్టి 'క్యూ ఆర్' కోడ్ ను జూలూరుపాడు పోలీస్ స్టేషన్ నందు ఎస్.ఐ రవి సిబ్బందితో కలిసి స్టేషన్ లో శుక్రవారం పొందుపరిచడం జరిగినది.

## ఆలయాలలో ముక్కోటి శోభ..

### తెల్లవారుజామునుంచే స్వామి దర్శనానికి ఆలయాలలో బారులు తీరిన భక్తులు





**అశ్వారావుపేట, జనవరి 10, ప్రజాజ్యోతి:**

ముక్కోటి ఏకాదశి సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఆలయాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. పవిత్ర పర్వదినం కావడంతో ఆలయాలలో స్వామివారి దర్శనం కోసం భక్తులు వేకువ ఝామునుంచే ఆలయాలవద్ద బారులు తీరారు. ఉత్తర ద్వారా దర్శనం కోసం తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయాల కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పర్వదినం సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఆలయాల ప్రాంగణాలన్ని కిక్కిరిసిపోయ్యాయి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా జంగారెడ్డిగూడెం రోడ్ లోని శ్రీ షిర్డీసాయిబాబా మందిరంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి తెల్లవారు ఝామున 4:30గంటలకు వేదమంత్రాలతో ఉత్సవమూర్తులను ప్రతిష్టించారు. అనంతరం ఆరాధన, శ్రీరామ మంత్ర సంపుటిత అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు. ఆపై భక్తులకు స్వామి మూలవరుల దర్శనం కల్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

## హైస్కూల్ లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



**జూలూరుపాడు/ జనవరి 10 (ప్రజా జ్యోతి) :**

సంక్రాంతి పండుగ సందర్భంగా జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో అడ్వాన్స్ సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. రేపటి నుంచి సెలవులు ప్రారంభం కావడంతో ముందస్తుగా సంబరాలను హైస్కూల్ లో విద్యార్థులు ఉపాధ్యాయులు కలసి ముగ్గులు వేశారు. భోగిమంటల తోటి సంక్రాంతి సంబరాలు అడ్వాన్స్ గా జరుపుకున్నారు . దీనికి పాఠశాల ఉపాధ్యాయ బృందాలు ప్రధానోపాధ్యాయులు అందరు ముగ్గులు వేసి రంగులు నింపిన విద్యార్థినీలను అభినందించారు. హెడ్మాస్టర్ లక్ష్మీనరసయ ఉపాధ్యాయులు రామ్ శెట్టి శ్రీనివాసరావు. శాంత కుమారి, గురుమూర్తి,రామనాథం వెంకటేశ్వరరావు,లలిత. ఉమామహేశ్వరి, ప్రసాద్, పటేల్ కృష్ణ,శకుంతల ఉన్నారు.

## ఆర్ అండ్ ఆర్ కాలనీలో క్షుద్ర పూజల కలకలం

### శివశక్తి దండు సారయ్య లక్ష్యంగా క్షుద్ర పూజలు
### ఘటనా స్థలానికి వెళ్లిన దండు సారయ్య, అనుచరులు
### తనను హతమార్చేందుకే క్షుద్ర పూజలు చేస్తున్నారని ఆవేదన



**ఇల్లందు/జనవరి 10, (ప్రజాజ్యోతి):**

ఇల్లందు పట్టణంలోని 13వ వార్డు ఆర్ అండ్ ఆర్ కాలనీలో శుక్రవారం క్షుద్ర పూజలు కలకలం రేపాయి. అదే వార్డుకు చెందిన శివశక్తి దండు సారయ్య ( సారిక) ను హతమార్చడమే లక్ష్యంగా క్షుద్ర పూజలు కొనసాగాయని తెలుస్తుంది. గత కొంతకాలంగా దండు సారయ్య చేస్తున్న సామాజిక సేవలు, ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తూ ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే కొంతమంది కుట్రపూరితంగా హతమార్చేందుకు క్షుద్ర పూజలు చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షుద్ర పూజలు చేస్తున్న విషయాన్ని తెలుసుకుని వెళ్లి చూడగా క్షుద్ర పూజలో తన ఫోటోని పెట్టి పూజలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందరికి మంచిని కోరుకునే తనపై ఇలా కుట్రలతో క్షుద్ర పూజలు చేయడం ఏమిటని కన్నీరు పెట్టుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి చూడగా ఆ ఇంటికి తాళం వేసి వ్యక్తులు పారిపోయినట్లు గుర్తించారు. సాయంత్రం స్థానికుల సహకారంతో ఇంటి తలుపులు తెరిచి చూడగా అసలు విషయం బహిర్గతమైంది. ఏది ఏమైనా శివశక్తి దండు సారయ్యను టార్గెట్ గా క్షుద్ర పూజలు చేస్తున్న వారేవరనేది విషయం వెలుగులోకి రావాల్సి ఉంది. దింతో ఆ ప్రాంతంలో కొంత భయానక పరిస్థితులు నెలకొన్నాయి.



## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**టేకులపల్లి/ జనవరి 10,( ప్రజాజ్యోతి) :**

బేతంపూడి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బసనబోయిన చిన్ని స్వర్గస్తులైనందున వారి భౌతికకాయానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కోరం సురేందర్, మండల నాయకులు ఈది గణేష్, రెడ్యా నాయక్, బానొత్ రవి, అనిల్, నరసింహారావు, బోస్, రమేశ్,సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

